# సాక్షి
## పార్వతీపురం మన్యం

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025




### ప్రయోగ్‌రాజ్‌లో పూజలు



విజయనగరం: మహా శివరాత్రి పర్వదినాన ప్రయోగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పుణ్యస్నానాలా చరించారు. కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.



### అవయవదానానికి అంగీకారం

వారంతా చదువుకున్న యువత. ఉన్నతంగా ఆలోచించారు. అవయవదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.

- 8లో

### నేడు ఉన్నత పాఠశాలలకు సెలవు

పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సెలవు ప్రకటించినట్టు వెల్లడించారు.

## న్యూస్‌రీల్

### సుభద్రమ్మవలసలోనే ఏనుగులు



సుభద్రమ్మవలస-పెదమేరంగి మధ్యలో ఉన్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి, సుభద్రమ్మవలస పంట పొలాల్లో ఏనుగులు బుధవారం సంచరించాయి. వరి, అరటి, మొక్కజొన్న పంటల్లో సంచరిస్తూ నాశనం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీశాఖ సిబ్బంది స్పందించి ఏనుగులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పకడ్బందీగా చదువుప్రణాళిక



బాలికలతో కలిసి భోజనం చేస్తున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త రూపవతి

వంగర: జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి విజయనగరం గురుకులాల సమన్వయకర్త శంబాన రూపవతి అన్నారు. 100 రోజుల చదువు ప్రణాళికను పకడ్బందీగా అమలుచేస్తున్నట్టు తెలిపారు. వంగర మండలం మద్దువలసలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. తొలుత వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత తనిఖీ చేశారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. అనంతరం డార్మిటరీ, తరగతి గదులు, క్రీడామైదానం పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై బోధన ప్రణాళిక అమలుతీరుపై ఆరా తీశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో నీట్, ఐఐటీ, ఎంసెట్ వంటి పోటీపరీక్షలకు ప్రత్యేక తర్ఫీదునిస్తామని తెలిపారు. కేఎల్‌వైఈఎస్ విధానంలో గురుకుల విద్యార్థులకు విదేశీ విద్యను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వంగర, ఉంగరాడమెట్ట గురుకులాల ప్రిన్సిపాల్స్ సాన పద్మజ, పేడాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### వణికిస్తున్న జ్వరాలు

- మంచంపడుతున్న చిన్నారులు
- ఆస్పత్రికి వస్తే తప్ప అటువైపు చూడని వైద్యులు
- జ్వరాలతో మరణాలు సంభవిస్తున్నా పట్టించుకోని వైనం
- అన్నింటికీ ఆశ కార్యకర్తే దిక్కు



ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి, తదితరులు

శృంగవరపుకోట: ధారపర్తి పంచాయతీ పరిధిలో 11 గిరిజన గూడలు ఉన్నాయి. అన్నీ ఇంచుమించుగా కొండలపై ఉన్న గ్రామాలే. సరైన రహదారి సదుపాయం లేదు. రాళ్లదారిలోనే రాకపోకలు. అత్యవసర వేళ డోలీయే దిక్కు. ఆరోగ్య సేవలకు ఆశ కార్యకర్తే ఆధారం. ఇప్పుడు రాయిపాలెం, కురిడి గ్రామాల్లోని చిన్నారులను జ్వరాలు వణికిస్తున్నాయి. ఇదే పంచాయతీలో గతంలో ఇద్దరు చిన్నారులు మరణించారు. ఇప్పుడు జ్వరాల వ్యాప్తితో తల్లిదండ్రులు హడలిపోతున్నారు. పిల్లలను భుజాన వేసుకుని ఆస్పత్రికి పరుగుతీస్తున్నారు. ఇప్పటికే రాయిపాలెం, కురిడి గ్రామాలకు చెందిన 12 మంది పిల్లలు ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. ఈ విషయం పత్రికల్లో బుధవారం ప్రచురితం కావడంతో కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది స్పందించారు. డాక్టర్ మానస ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి శాంపిల్స్ సేకరించారు. మరో ఇద్దరు జ్వరాలతో బాధపడుతున్నట్టు గుర్తించారు.

**చిన్నారులను పరామర్శించిన డీఎంహెచ్ఓ**

ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న 12 మంది గిరిజన చిన్నారులను డీఎంహెచ్ఓ జీవనరాణి బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. చిన్నారుల నుంచి బ్లడ్, యూరిన్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయాలని ఆదేశించారు. సాధారణ వైరల్ జ్వరాలే అని, ఆందోళన అవసరం లేదన్నారు.

# ఉదయం 8 గంటల నుంచే.. పోలింగ్



ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం
- 15 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ
- నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,333 మంది ఓటర్లు
- ఎన్నికల వేళ జిల్లాలో నిషేధాజ్ఞ ఉత్తర్వులు జారీ

| | |
|---|---|
| జిల్లాలో మొత్తం ఓటర్లు : | 2,333 |
| పురుషులు : | 1,574 |
| మహిళలు : | 759 |
| పోలింగ్ కేంద్రాలు : | 15 |

సాక్షి, పార్వతీపురం మన్యం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికకు జిల్లాలో సర్వం సిద్ధమైంది. ఉదయం 8 గంటలకే తొలి ఓటు పడనుంది. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. బరిలో పది మంది అభ్యర్థులు నిలవగా... ప్రధానంగా ముగ్గురి మధ్యనే పోటీ జరగనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కోరెడ్ల విజయ గౌరి, గాదె శ్రీనివాసుల నాయుడు, పాకలపాటి రఘువర్మ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఎన్నడూ లేని విధంగా.. కూటమి పార్టీ నాయకులు ఈ ఎన్నికలను సైతం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రచారం చేశారు. స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రచార బాధ్యతను తమ భుజాల మీద వేసుకోవడం ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలకు, చర్చకు దారి తీసింది. ద్వితీయ ప్రాధాన్య ఓటుపైనా కూటమి నాయకులు దృష్టి సారించారు. తమకు పడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మేధావివర్గంగా పేరొందిన ఉపాధ్యాయ వర్గానికి చెందిన ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. ఎలాంటి ప్రచారాలకు తావులేకుండా ఎన్నికలకు దూరంగా ఉంది.

**ఎన్నికల సామగ్రి తరలింపు..**

27వ తేదీన జిల్లావ్యాప్తంగా 15 కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన బుధవారం ఉదయం జరిగింది. తొలుత పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్, జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత పరిశీలించారు.



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

మెటీరియల్ పంపిణీలో లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల దృష్ట్యా జిల్లాను ఆరు జోన్లుగా విభజించి, సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో వాహనాల్లో పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల అధికారులు, సిబ్బంది తరలివెళ్లారు. మొత్తం 90 మంది వరకూ సిబ్బందిని వినియోగిస్తున్నారు. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నిక జరగనుంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియగానే.. బాక్సులను మరలా కలెక్టరేట్ నుంచి ఏ సమయానికైనా బందోబస్తు నడుమ విశాఖ తరలిస్తారు.

**పోలింగ్ ముగిసే వరకూ ఆంక్షలు**

ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ ముగిసే వరకు జిల్లాలో ప్రత్యేక నిషేధ ఆంక్షలు ఉంటాయి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు మించి గుమిగూడకుండా నిషేధాజ్ఞలు విధించారు. చట్ట వ్యతిరేకంగా గుమిగూడటం, సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధం. రాజకీయ పక్షాలకు చెందిన పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు వంటి వాటిపై కూడా నిషేధాజ్ఞలు వర్తిస్తాయని కలెక్టర్ శ్యాంప్రసాద్ స్పష్టం చేశారు.



కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత

జిల్లాలోని 15 మండలాల పరిధిలో పోలింగ్ స్టేషన్లవారీగా ఓటర్ల సంఖ్య

| మండలం | పోలింగ్ స్టేషన్ | ఓటర్లు |
|---|---|---|
| వీరఘట్టం | 1 | 120 |
| సీతంపేట | 2 | 121 |
| భామిని | 3 | 44 |
| పాలకొండ | 16 | 301 |
| కొమరాడ | 40 | 65 |
| జీఎల్‌పురం | 41 | 189 |
| కురుపాం | 42 | 120 |
| జియ్యమ్మవలస | 43 | 91 |
| గరుగుబిల్లి | 44 | 105 |
| పార్వతీపురం | 45 | 636 |
| (అర్బన్, మండలం) | | |
| మక్కువ | 46 | 55 |
| సీతానగరం | 47 | 114 |
| బలిజిపేట | 48 | 88 |
| సాలూరు | 50 | 250 |
| (అర్బన్, మండలం) | | |
| పాచిపెంట | 51 | 34 |

**అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్**

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశాం. వారందరికీ ఓటర్ స్లిప్పులను కూడా పంపిణీ చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశాం. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లు సమకూర్చాం. వేసవి దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎండ తగలకుండా షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేశాం. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని చర్యలు తీసుకున్నాం.

– ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్

**షెడ్యూల్ ప్రకారం పోలింగ్**

జిల్లాలోని 15 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉదయం 8 గంటలకే షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటలతో ముగియనుంది. ఆ మేరకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. పోలింగ్ ముగిశాక బాక్సులు కలెక్టరేట్కు చేరుకుంటాయి. ఇక్కడ నుంచి మరలా విశాఖ తరలిస్తాం.

– శోభిక, సంయుక్త కలెక్టర్

## అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు

- కూటమి నాయకుల తీరును తప్పుబట్టిన మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



విశ్వాసరాయి కళావతి

పాలకొండ రూరల్: కూటమి నాయకులు అసెంబ్లీ సాక్షిగా నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని పాలకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండిపడ్డారు. స్థానిక విలేకరులతో ఆమె బుధవారం మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసిన చంద్రబాబు, కూటమి నాయకులు... అధికారంలోకి వచ్చాక ఆర్థిక వ్యవస్థ బాగులేదంటూ సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు అసెంబ్లీ సమావేశాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లే యత్నం చేస్తున్నారన్నారు. 2019కి ముందు టీడీపీ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఎలా దిగజారిపోయిందో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో పూర్తి ఆధారాలు చూపించి మాట్లాడారన్నారు. ఇప్పుడు నిరాధార ఆరోపణలతో కూటమి నాయకులు ప్రజలను మోసం చేసేయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గతంలో అమలైన సంక్షేమ పథకాలు రద్దు చేయడం మినహా కొత్తగా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. రాజకీయ వేధింపులకు పాల్పడుతూ ఆర్థిక వ్యవస్థ విధ్వంసం అయ్యిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తొమ్మిదిసార్లు ఎమ్మెల్యే, సుదీర్ఘ రాజకీయ అనుభవం, సంపద సృష్టిస్తా అంటూ బీరాలు పలికిన చంద్రబాబు.. ప్రతి ఎన్నికలో పొత్తుల పేరిట వేరొకరి చేతి కర్ర లేకుండా అధికారంలోకి రాలేకపోయారన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజాహితం కోరి ఇచ్చిన హామీలు యథాతదంగా అమలు చేయాలన్నారు.

## భక్తజన తీర్థం



ఆలయ ప్రాంతంలో జాగరాలు చేస్తున్న భక్తులు

- శివరాత్రికి తరలివచ్చిన అశేష భక్తజనం
- రామతీర్థం ఆలయ ప్రాంగణంలో జాగరణ
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శిఖర జ్యోతి

నెల్లిమర్ల రూరల్: శివరాత్రి పర్వదినాన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం బుధవారం భక్తజన తీర్థంగా మారింది. సాక్షాత్తు శ్రీరాముడు ఇక్కడ శివుని మంత్రం జపించారని విశ్వసించిన భక్తులు.. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి రాముడి సన్నిధిలో శివరాత్రి జాగరణ చేశారు. శివకేశవులకు భేదంలేదని చాటారు. రామస్వామివారి ఆలయం, ఆలయ క్షేత్ర పాలకుడైన ఉమాసదాశివ ఆలయం, రామకోనేరు, బోడికొండ, గురుభక్తుల కొండ, దుర్గాభైరవ కొండ ప్రాంతాలన్నీ భక్తజనంతో కిక్కిరిసాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో కాగడాలు వెలిగించి రాత్రంతా శివజాగరణ చేశారు.

**ప్రత్యేక అభిషేకాలు**

రామాలయ క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న ఉమాసదాశివ ఆలయంలో అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో బుధవారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరిపించారు. 11 రకాల ఫలరసాలు, భస్మ, చందన, హరిద్రా కుంకుమ, సుగంధ ద్రవ్య, నారికేళ జలాలతో శివుడికి మహాభిషేకం చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు మహాలింగోద్భవ సమయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భస్మపూజ, అష్టమూర్తి హారతి, త్రయంబిక మంత్రజపం జరిపారు.



సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

**వెలుగులు పంచిన శిఖర జ్యోతి**

రామతీర్థం బోడికొండ పర్వతంపై శిఖరదీపాన్ని సాయంత్రం 6 గంటలకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి వెలిగించారు. దీనికి కావాల్సిన సామగ్రిని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సమకూర్చారు. రెండు రోజుల పాటు శిఖర దీపం కొండపై వెలగనుంది. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పర్వతంపైకి చేరుకొని శిఖరదీపాన్ని దర్శించుకున్నారు. ఈఓ వై.శ్రీనివాసరావు, సీఐ రామకృష్ణ, ఎస్సై గణేష్, పోలీస్ సిబ్బంది ఉత్సవాలను దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సేవలందించారు. సతివాడ, కొండవెలగాడ వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మిమ్స్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో వైద్య సేవలు కొనసాగాయి.

## శివరాత్రి శోభ



గుంపలోని సోమేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దంపతులు



పార్వతీపురం పట్టణంలోని పశుపతినాథ బ్రహ్మసూత్ర శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



సాలూరులోని పారమ్మకొండపై వెలిగించిన అఖండజ్యోతి

శివరాత్రి పర్వదినాన పార్వతీపురం మన్యం జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ బుధవారం భక్తసంద్రంగా మారాయి. పుణ్యనదుల్లో స్నానమాచరించి ముక్కంటేశ్వరునికి భక్తులు మనసారా అర్చనలు, అభిషేకాలు జరిపారు. మారేడు దళాలు సమర్పించి.. మా స్వామివి నీవేనంటూ ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షతో శివనామస్మరణలో తరించారు. భజనలు, భక్తి గీతాలాపనలతో జాగరణ చేశారు. రోజంతా ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. కొమరాడ మండలం కోటిపాం పంచాయతీ దేవుని గుంప సమీపంలో నాగవళి, జంఝావతి నదుల సంగంలో వెలిసిన గుంప సోమేశ్వరుడిని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులతో పాటు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

– కొమరాడ/పార్వతీపురం టౌన్



నాగావళి, జంఝావతి సంగమ ప్రదేశంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

## ఆ పాదముద్రలు పులి పిల్లలవి కాదు

చీపురుపల్లి రూరల్ (గరివిడి):

అవి పులి పిల్లల పాదముద్రలు కాదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుబ్బారావు స్పష్టంచేశారు. గరివిడి మండలం శివరాం గ్రామంలోని ఓ రైతు పొలంలో పులి పిల్లల పాదముద్రలు కనిపించాయన్న వార్తతో గ్రామస్తులు భయాందోళన చెందారు. తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజుతో పాటు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో తహసీల్దార్, ఆర్ఐ అచ్యుతరావు, ఫారెస్టు రేంజ్ అధికారి కలిసి పాదముద్రలను పరిశీలించారు. అవి పులి పిల్లలవి కాదని, వేరే జాతి జంతువుల పిల్లల అడుగులుగా నిర్ధారించారు.



పొలంలో అడుగులను పరిశీలిస్తున్న ఫారెస్టు, రెవెన్యూ అధికారులు

## క్లుప్తంగా

### పోలీసుల అదుపులో చీటీల మోసగాళ్లు

**భోగాపురం:** మండల కేంద్రం భోగాపురంలో కొన్ని సంవత్సరాలుగా చీటీలు, చిన్నచిన్న ల్యాండ్ వ్యాపారాలు చేసుకుంటూ భార్యాభర్తలు తిరుమరెడ్డి మురళి, తులసి కుటుంబంతో జీవనం సాగిస్తున్నారు. ఇలా జీవనం సాఫీగా సాగిపోతున్న సమయంలో గడిచిన రెండు నెలలుగా చీటీదారులకు, అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పకుండా ఊరిలోనూ కనిపించకుండా బయట తిరుగుతున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దాదాపు రూ.30కోట్లు నష్టపోయామని బాధితులు పోలీసులు ముందు వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు తిరుమరెడ్డి మురళి, తులసిలను రాజమహేంద్రవరంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి తగరపువలస ఉన్న ఇంటితో పాటు, భోగాపురంలో ఉన్న రెండు ఇళ్లు,, కొన్ని రకాల ల్యాండ్‌కు సంబధించిన రికార్డులను స్వాధీనం చేకుసుకున్నారు. అనంతరం విజయనగరం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు సీఐ ఎస్‌వీ ప్రభాకర్ బుధవారం తెలిపారు.

### వంగరలో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**వంగర:** మండల కేంద్రం వంగరలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కర్రి రాములు గడ్డివాము దగ్ధం కాగా దేవకివాడ రామినాయుడు, రౌతు అసిరినాయుడులకు చెందిన జీడి, మామిడి చెట్లు ఆహుతయ్యాయి. సమాచారం మేరకు రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

### విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన ఇల్లు



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న రాజాం ఫైర్ ఆఫీసర్ టి.మోహనరావు

**వంగర:** మండల పరిధి కింజంగి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పెంకుటిల్లు కాలిపోయింది. బుధవారం గ్రామానికి చెందిన గంట లక్ష్మి ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు రాజాం ఫైర్ ఆఫీసర్ టి.మోహనరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక శకటంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో నగదు కొంత కాలిపోయిందని బాధితురాలు గంట లక్ష్మి అధికారులకు తెలిపింది. ఈ ఘటనలో రూ.2లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని వీఆర్‌వో గెడ్డాపు శ్రీనివాసరావు వెల్లడించారు.

### మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



మద్యం సీసాలతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

**బొబ్బిలి:** తెర్లాం మండలం కుసుమూరులో 14 మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు విలేకరులకు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 48 గంటల పాటు మద్యం విక్రయాలు నిషేధించామని, అయినా ఇతర ప్రాంతాల్లో మద్యం విక్రయాలను చేపడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా మద్యం సీసాలతో దొరికితే అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్‌డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹91 | ₹152 | 162 |



# శతశాతం ఉత్తీర్ణతకు కృషి



- టెన్త్‌లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- గిరిజనుల అభివృద్ధికి చర్యలు
- 'సాక్షి'తో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

**సాక్షి, పార్వతీపురం మన్యం:** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని.. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ పెట్టి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను బట్టి ఏ, బీ, సీ, డీలుగా విభజించి, వారిలో విద్యానైపుణ్యాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ప్రధానంగా చదువులో సీ, డీ గ్రేడ్‌ల్లో ఉన్నవారిపై దృష్టి సారించి, ఉత్తీర్ణత మార్కులు సాధించేలా బోధన సాగిస్తున్నామన్నారు. ప్రత్యేక తరగతులను తనతో పాటు కలెక్టర్, ఇతర అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న పలు అంశాలపై ఆయన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పీఎం జన్‌మన్ పథకం కింద చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం 1,450 గ్రామాలుంటే.. అందులో 416 పీవీటీజీ గ్రామాలున్నాయి. వీటిలో పీఎం జన్‌మన్ పథకం కింద తాగునీరు, గృహనిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు, పీఎం సూర్యఘర్ కింద సోలార్ పవర్ ఏర్పాటు చేసుకునేలా చైతన్యవంతం చేస్తున్నాం. డీఏ – జేజీ యూఏ(ధర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్) పథకం కింద ప్రతిపాదనలు పంపుతున్నాం. ఇందులో భాగంగా పక్కా ఇళ్లు, నీటి సరఫరా, కమ్యూనిటీ కుళాయిలు, విద్యుత్, మొబైల్ మెడికల్ యూనిట్లు, ఆయుష్మాన్ కార్డులు వంటి సౌకర్యాలు కలగనున్నాయి.
- ఆర్టికల్ 275(1) పనుల కింద షెడ్యూల్డ్ తెగల గ్రామాల్లో రక్షిత తాగునీరు, రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్తు, గృహ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధానమిస్తున్నాం. గోకులం షెడ్లు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలనూ త్వరితగతిన పూర్తి చేయాలని చెబుతున్నాం.
- పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 54 వన్‌ధన్ వికాస కేంద్రాలు (వీడీవీకే) ఉన్నాయి. ఇందులో 300 మంది వరకు సభ్యులుగా ఉంటారు. గిరిజనులు పండించిన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్, బ్రాండింగ్ కల్పించి అదనపు ఆదాయం వచ్చేలా చేయాలన్న ముఖ్య ఉద్దేశంతోనే ఈ వీడీవీకేలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాలకు రూ.4 కోట్ల వరకు నిధులు మంజూరుకాగా, ఇందులో సుమారు రూ.40 లక్షల వరకు వెచ్చించి ఎనిమిది చింతపండు కేకు మిషన్లు, రెండు మిల్లెట్ ప్రాసెసింగ్ మిషన్లు, రెండు పసుపు పిండి తయారు చేసే మిషన్లు కొనుగోలు చేశాం. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాం.
- ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో ఆదివాసీ మహోత్సవం జరుగుతోంది. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో మన వీడీవీకేల తరపున రెండు వెళ్లాయి. మిల్లెట్స్, బిస్కెట్స్, కొండ చీపుర్లు స్టాల్స్‌ను మనవాళ్లు ప్రదర్శనలో ఉంచారు.
- పార్వతీపురం ఏఎంసీలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ తుది దశకు చేరుకుంది. ఏప్రిల్ మొదటి వారానికి సిద్ధం కానుంది.

### ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ



ఆర్.కృష్ణవేణి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు

ఆశ్రమ, ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు కలెక్టర్, పీవో ఆదేశాలతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలోని విద్యాలయాల్లో సన్నద్ధత తీరును ఆమె 'సాక్షి'కి వివరించారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 40 ఆశ్రమ పాఠశాలలు ఉండగా 1,518 మంది.. జోగింపేట, కురుపాం, భద్రగిరి, పి.కోనవలస, కొమరాడ, భద్రగిరి(బాలురు) తదితర ఆరు గురుకులాల్లో 415 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వీరందరికీ మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా... ఈఎంఆర్ ఎస్కు సంబంధించి 211 మంది సీబీఎస్‌ఈ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయని వివరించారు. మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా.. ఏపీఆర్‌జేసీ మొదటి సంవత్సరం 675 మంది, ద్వితీయ సంవత్సరం 660 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

**సిలబస్ పూర్తి..**

పదోతరగతి, ఇంటర్మీడియట్‌కు సంబంధించిన సిలబస్ మొత్తం పూర్తి అయ్యిందని ఆమె తెలిపారు. పదిలో రివిజన్ కూడా పూర్తి అయ్యిందని, ప్రీ ఫైనల్ పరీక్షలు కూడా పెట్టి వారిలో పరీక్షలు అంటే భయం పోగొట్టేలా సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. వెనుకబడిన వారిపై మరింత శ్రద్ధ చూపి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నామని చెప్పారు.

**విద్యార్థుల ఆరోగ్యంపైనా దృష్టి..**

విద్యార్థుల ఆరోగ్యంపైనా పీవో ఆదేశాలతో ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలతో పాటు.. పాలు, గుడ్లు అదనంగా ఇస్తున్నామని చెప్పారు.

# పోలింగ్ ఏర్పాట్లు పరిశీలించిన జేసీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జేసీ సేతు మాధవన్

**చీపురుపల్లి:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ బుధవారం పరిశీలించారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎనిమిది మండలాలకు సంబంధించిన పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదం, గుర్ల, రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లో ఎన్నికల నిర్వహణకు నియమించిన పోలింగ్ సిబ్బందికి కిట్లను ఆర్డీఓ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. సజావుగా పోలింగ్ నిర్వహణ జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానానికి అంగీకారం

- ముందడుగు వేసిన వెదుళ్లవలస యువత

**చీపురుపల్లి రూరల్ (గరివిడి):** వారంతా చదువుకున్న యువత. ఉన్నతంగా ఆలోచించారు. అవయవదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మరణాంతరం తమ శరీర అవయవాలు బూడిదలో కలిసిపోకూడదని, ఈ సమాజంలో అవయవాల లోపంతో జీవిస్తున్న మరెంతోమందికి తమ మరణాంతరం తమ అవయవాలతో మంచి జరగాలనే సంకల్పంతో అవయవదానం చేసేందుకు అంగీకరించారు. ఈ మేరకు చీపురుపల్లి పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ.గోవిందరాజులు గ్రామానికి వెళ్లి అవయవదాన ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన 120 మంది యువత, గ్రామస్తులు అవయవదానానికి అంగీకారం తెలుపుతూ అంగీకార పత్రాలపై సంతకాలు చేసి మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు బీవీ.గోవిందరాజులుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామయువత, పెద్దలు తలాడ సుబ్బలక్ష్మి, పెనుమత్స సాంబమూర్తిరాజు, గుడివాడ నారాయణరావు, పిల్ల నారాయణరావు, కోన పైడినాయుడు, బార్నాల సూరప్పలనాయుడు, శనపతి అప్పలనాయుడు, గుడివాడ శ్రీరాంనాయుడు, జమ్మాన తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అవయవదాన అంగీకార పత్రాలను మానవీయతా సంస్థకు అందజేస్తున్న యువత, గ్రామస్తులు

## రెండు కేసులు నమోదు

**సంతకవిటి:** మండలంలోని మండాకురిటి గ్రామానికి చెందిన కొప్పుశెట్టి కోటేశ్వరరావు, పలిశెట్టి శీతయ్యలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేయడంతో 5గురు వ్యక్తులపై రెండు కేసులు నమోదు చేశామని హెచ్‌సీ వంజరాపు జనార్దనరావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ..కొప్పుశెట్టి కోటేశ్వరరావు పొలంలో సర్వే మొక్కలను పలిశెట్టి శీతయ్యకు చెందిన నాటు బండ్లు కుమ్మేయడంతో గొడవ జరిగింది. పలిశెట్టి శీతయ్య, లక్ష్మణరావు, గోవిందలు తనపై దాడి చేశారని కొప్పుశెట్టి కోటేశ్వరరావు.. కొప్పుశెట్టి కోటేశ్వరరావు, శ్రీనులు తమపై దాడి చేశారని పలిశెట్టి శీతయ్య ఫిర్యాదు చేయడంతో పరస్పర ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేశామని వెల్లడించారు.

### బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..

# మహాశివరాత్రి వేడుకలు



భక్తులను ఆకట్టుకున్న శివలింగాల ప్రదర్శన

**విజయనగరం టౌన్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. అద్దాలతో అలంకరణ చేసిన శివలింగాల ప్రదర్శన భక్తి భావాన్ని పెంపొందించింది. భారతదేశంలో ఉన్న జ్యోతిర్లింగాలను ఆయా స్థానాల్లో ఏర్పాటుచేసి, వాటి విశిష్టతను బ్రహ్మకుమారీలు వివరించారు. బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ బీకే. అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో బ్రహ్మకుమారీలు, భక్తులు పాల్గొన్నారు.



అద్దాల అలంకరణలో మహాశివలింగాలు



విద్యుత్ అలంకరణలో కంటోన్మెంట్ బ్రహ్మకుమారీస్ కేంద్రం

# ఆదాయ లక్ష్య సాధనలో వెనుకబాటు

- మార్కెట్ కమిటీల లక్ష్యం రూ.12.89 కోట్లు
- ఈనెల10 నాటికి సాధించింది రూ.7.41కోట్లు

**ఈ నెల 10వరకు సాధించిన ఆదాయ వివరాలు:**

| మార్కెట్ కమిటీ పేరు | సాధించిన లక్ష్యం (రూ.లక్షల్లో) |
|---|---|
| విజయనగరం | రూ.80.45 |
| బొబ్బిలి | రూ.180.23 |
| గజపతినగరం | రూ. 78.79 |
| చీపురుపల్లి | రూ.83.59 |
| కొత్తవలస | రూ.83.63 |
| పూసపాటిరేగ | రూ.140.72 |
| మెరకముడిదాం | రూ.18.18 |
| రాజాం | రూ. 76.18 |




విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

**విజయనగరం ఫోర్ట్:** వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు ఆదాయ లక్ష్య సాధనలో వెనుకబడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్ష్య సాధనకు గడువు తక్కువ కాలమే ఉండడంతో మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని సాధించడం అంత తేలిక కాదని తెలుస్తోంది. నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని సాధించగలిగితే వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో రైతుబజార్లు, వ్యవసాయ చెక్‌పోస్టులు ఉంటాయి. వాటి నిర్వహణ, కార్యకలాపాలు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోనే జరుగుతాయి.

**జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు**

జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, పూసపాటిరేగ, కొత్తవలస, చీపురుపల్లి, మెరకముడిదాంల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వాటి పరిధిలో 12 వ్యవసాయ చెక్‌పోస్టులు ఉన్నాయి.

**ఆదాయ లక్ష్యం రూ. 12.89 కోట్లు**

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆదాయ లక్ష్యం రూ.12.89 కోట్లు. ఈ నెల 10 వతేదీ నాటికి వ్యవసాయ మార్కెట్ కమిటీలు సాధించిన ఆదాయం రూ.7.41 కోట్లు ఇంకా రూ. 5.48 కోట్లు ఆదాయం సాధించాల్సి ఉంది. మార్చి నెలఖారు లోగా ఈ లక్ష్యాన్ని సాధించాలి. వ్యవసాయ చెక్‌పోస్టులు, గోదాములు, వ్యాపార లావాదేవీల ద్వారా ఆదాయం వస్తుంది. వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర సామగ్రిని తరలించే వాహనాల నుంచి రుసుమును వ్యవసాయ చెక్ పోస్టుల వద్ద సిబ్బంది వసూలు చేస్తారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఉన్న షాపుల నుంచి సెస్‌లు, మార్కెట్ కమిటీల్లో జరిగే వ్యాపారలావాదేవీల ద్వారా, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించి గోదాముల అద్దె ద్వారా మార్కెట్ కమిటీలకు ఆదాయం వస్తుంది.

**శతశాతం సాధించేందుకు కృషి**

జిల్లాలో ఇప్పటివరకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు రూ.7.41 కోట్ల ఆదాయాన్ని సాధించాయి. ఇంకా రూ. 5.48 కోట్లు సాధించాల్సి ఉంది. మార్చి నెలాఖరు వరకు సమయం ఉన్నందున శతశాతం ఆదాయ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తాం.

బి.రవికిరణ్, మార్కెటింగ్‌శాఖ ఎ.డి

# మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



సోములు (ఫైల్)

**బొబ్బిలి:** పట్టణంలోని కొత్త ఎరుకల వీధికి చెందిన గేదెల సోములు(29) మనస్తాపంతో తాను నివసిస్తున్న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్ రమేష్ విలేకరులకు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం తరచూ తనను ఎవరూ ఖాతరు చేయడం లేదని సోములు విసుక్కుంటూ తనలో తానే మాట్లాడుకుంటూ తిట్టుకుండే వాడు. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరు పిల్లలు, భార్యతో కలిసి శంబర పండగకు వెళ్లారు. అక్కడ దర్శనం సమయంలో కాస్తా ఆలస్యమైంది. ఆ సమయంలో ఎవరో త్వరగా వెళ్లమని ముందకు తోయడంతో భార్యపై చిరాకు పడ్డాడు. సోములు కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి వచ్చేసినా అదే ఆలోచనతో బాధపడ్డాడు. రాత్రి సమయంలో ఇంట్లోని మొదటి గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన భార్య ఇరుగుపొరుగు సాయంతో వచ్చి కిందికి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

- గుర్ల మండలంలో ఫిట్‌నెస్ కేంద్రం ఏర్పాటు
- జిల్లాలోని కమర్షియల్ వాహనాలన్నింటికీ ఇక్కడే బ్రేక్
- కంప్యూటర్ ఓకే చేస్తేనే వాహనాలకు సర్టిఫికెట్

# ప్రైవేట్‌కే వాహనాల ఫిట్‌నెస్..!



అచ్యుతాపురం వద్ద ఉన్న ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రం

**గుర్ల:** జిల్లాలోని కమర్షియల్ వాహనాలైన నాలుగు చక్రాలు, మూడు చక్రాలు, ట్రాక్టర్లు, భారీ వాహనాలకు ఫిట్‌నెస్ (బ్రేక్) ధ్రువీకరణ పత్రం గురించి ఆర్‌టీఓ కార్యాలయానికి ఇకపై వెళ్లనవసరం లేదు. ఆర్‌టీఓ కార్యాలయం వద్ద ఉన్న మధ్యవర్తులకు చెక్‌పెట్టిన ప్రభుత్వం..వాహనాలకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం అందించేందుకు జిల్లాలోని గుర్ల మండలం అచ్యుతాపురం వద్ద రాజస్థాన్‌కు చెందిన ప్రైవేట్ కంపెనీకి బాధ్యతలు అప్పగించింది. అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ కేంద్రానికి ఆన్‌లైన్‌లో శ్లాట్ బుక్ చేసుకున్న వాహన యాజమానులు వారికి కేటాయించిన తేదీలలో వాహనాలను తీసుకురావాల్సి ఉంటుంది. వారం రోజుల నుంచి అచ్యుతాపురం ఫిట్‌నెస్ కేంద్రం వద్దకు బ్రేక్ కోసం వాహనాలు రావడం ప్రారంభమైంది.

**కంప్యూటర్ ఒకే అంటేనే**

గతంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌టీఓ అధికారులు ఫిట్‌నెస్ కోసం వచ్చిన వాహనాలను పూర్తిస్థాయిలో చెక్ చేసి చిన్న చిన్న రిపేర్లు ఉంటే వాటిని వెంటనే గుర్తించి రిపేర్ చేసుకుని వచ్చిన వాహనాలకు ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రం అందజేసేవారు. ఇప్పుడు మాత్రం ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రం కోసం వచ్చిన వాహన యజమానులు శ్లాట్ బుక్ చేసుకుని రావాలి. వాహనాలు ఏ మాత్రం కండిషన్ లేకపోయినా, చిన్న చిన్న రిపేర్లను కంప్యూటర్ గుర్తించినా వారి శ్లాట్ రద్దవుతుంది. పూర్తి కండిషన్‌లో ఉన్న వాహనాలకు మరుసటి రోజు ఫిట్‌నెస్‌గా ఉందా? లేదా? అనేది తెలుస్తుంది. ఆన్‌లైన్‌లో మాత్రమే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంది.

**ఆర్‌టీఓ ధృవీకరణ అవసరం లేదు**

జిల్లాలోని కమర్షియల్ వాహనాలు, మూడు చక్రాల వాహనాలకు ఆర్‌టీఓ అధికారులు నేరుగా వాహనాలను నడిపి వాటికి బ్రేక్ చేసేవారు. అచ్యుతాపురం వద్ద ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రం ద్వారా ఆర్‌టీఓ అధికారుల ప్రమేయం లేకుండానే ఇప్పుడు వాహనాలకు బ్రేక్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని ఆర్‌టీఓ అధికారులు వాహనాలను తనిఖీలు చేసినప్పుడు చూపిస్తే ఎటువంటి కేసులు నమోదు చేయరు. బ్రేక్‌తో పాటు వాహనాల పొల్యూషన్ సర్టిఫికెట్ కూడా ఆన్‌లైన్‌లో అందజేస్తారు.

**ఆర్‌టీఓలకు సంబంధం లేదు**

వాహనాలకు ఫిట్‌నెస్ కోసం ప్రైవేట్ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది. ఆ సంస్థ ఏ విధంగా వాహనాలకు ఫిట్‌నెస్ తనిఖీ చేస్తుందో సమాచారం లేదు. ఫిట్‌నెస్ తనిఖీలు చేస్తున్న సంస్థ కూడా ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. ప్రభుత్వ ఆదేశాలనుసారం మా విధులు నిర్వహిస్తాం.

దుర్గాప్రసాద్, ఆర్‌టీఓ, విజయనగరం